సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం ❘ 18 ❘ మే ❘ 2023



సాయం చేయండి

రాష్ట్రం దాటి, బతుకుదెరువు కోసం వచ్చిన ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. సాయం కోసం ఎదురుచూస్తోంది.

8లో▸



ప్రజల భద్రత కోసమే పోలీస్‌శాఖ

సమాజంలో ప్రజల భద్రత కోసమే పోలీస్‌శాఖ పనిచేస్తుందని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రవికుమార్ అన్నారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
42.0/27.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండవేడిమి ఎక్కువవుతుంది. వడగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

రాజన్న సన్నిధిలో వేద సమ్మేళనం

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న సన్నిధిలో గురువారం వేదసమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఆలయ ఆవరణలో శృంగేరీ శారదాపీఠాధీశ్వరులు శంకరాచార్య ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 250 మంది వేదపండితులకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు.

పరిశ్రమలను ప్రోత్సహించాలి



మిల్లును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న పరిశ్రమలను ప్రోత్సహించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అన్నారు. మండలంలోని మర్తనపేటలో నిర్మించిన వినాయక ఇండస్ట్రీస్ (రైస్‌మిల్)ను బుధవారం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పరిశ్రమలు ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. పరిశ్రమలతో స్థానికులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణరావు, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య, సెస్‌వైస్ చైర్మన్ తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు

కోనరావుపేట: గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు. మండలంలోని కొండాపూర్, వెంకట్రావుపేటలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో మాట్లాడారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే చికిత్స అందించడానికి సులువు అవుతుందన్నారు. శిబిరాల్లో స్క్రీనింగ్ పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. బీపీ, షుగర్ వస్తున్న నేపథ్యంలో తరచూ పరీక్షలు చేసుకోవాలన్నారు. శిబిరాల్లో గుర్తించిన వారికి కరీంనగర్‌లోని ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. సర్పంచులు మంతెన సంతోష్, మల్యాల దేవయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ పల్లం సత్తయ్య, నాయకులు పాల్గొన్నారు.

గాంధీపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు

ముస్తాబాద్: జాతిపిత మహాత్మాగాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని పోతుగల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. నాయకులతో కలిసి రాస్తారోకో చేపట్టారు. గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామన్న బీఆర్‌ఎస్ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, ప్రశాంత్,రాకేశ్, వెంకటేశ్, కిట్టు పాల్గొన్నారు.

కంటి వెలుగులో 3,994 మందికి పరీక్షలు

సిరిసిల్ల: కంటి వెలుగులో భాగంగా జిల్లాలో బుధవారం 3,994 మందికి పరీక్షలు నిర్వహించారు. 620 మందికి రీడింగ్ కళ్లద్దాలు, 673 మందికి పాయింట్ అద్దాలు అందించారు.

ప్రశాంతంగా పాలిసెట్



సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో ఇంజినీరింగ్ విద్య అభ్యసించేందుకు బుధవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 8 పరీక్ష కేంద్రాల్లో 1859 మంది హాజరైనట్లు జిల్లా కో–ఆర్డినేటర్ బి.రాజగోపాల్ తెలిపారు. బాలురలో 943 మందికి 887 మంది, బాలికల్లో 1039 మందికి 972 మంది హాజరైనట్లు వివరించారు. పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ పి.ప్రభాకరాచారి, సాంకేతిక విద్యాశాఖ ప్రత్యేక పరిశీలకులు బి.సతీష్‌కుమార్, రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

నిప్పుల కుంపటి..!



- వారం రోజులుగా దంచికొడుతున్న ఎండలు
- 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న ప్రజలు
- ఉదయం 9 గంటలకే రోడ్లన్నీ నిర్మానుష్యం
- సాయంత్రమైనా బయటకురాని జనం



నాలుగురోజుల్లో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు (డిగ్రీల్లో)

తేదీ	కనిష్టం	గరిష్టం
14	26	40
15	29	40
16	28	41
17	26	42

ఎండలు మండుతున్నాయి. సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడా..! అన్నట్లుంది వాతావరణం. జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదైతున్నాయి. బుధవారం అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారంరోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. బయటకు వెళ్లాలంటేనే జనాలు జంకుతున్నారు. రానున్న వారం రోజులు కూడా వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటిస్తుండడంతో జనాలు బెంబేలెత్తుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలతోపాటు మూగజీవాలు రోగాల బారిన పడుతున్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఎండల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

నీటిశాతం తగ్గనీయొద్దు..



ముఖ్యంగా ఎండలో తిరుగొద్దు. ఎండకు పోయేవారు తలపై టోపీ, టవల్ చుట్టుకోవాలి. సాధారణంగా మూడు లీటర్ల నీరు తీసుకుంటాం. ఎండాకాలంలో కనీసం నాలుగు లీటర్ల వరకు నీరు తాగాలి. ఒకేసారి కాకుండా ప్రతి అరగంటకు ఒకసారి గ్లాస్ చొప్పున నీరు తాగడం మంచిది. శరీరానికి వడగాల్పులు తగలకుండా ఉండాలి. ఎండకు కలిగే అధిక ఉష్ణోగ్రత వల్ల మన శరీరంలో నుంచి ఎలక్ట్రోలైట్స్ పోతాయి. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. అధిక జ్వరం, తలనొప్పి, తలతిరగడం, వాంతులు, విరేచనాలు కలుగుతూ నీరసించి పడిపోతుంటారు. డీహైడ్రేషన్ అధికమైతే ప్రాణాలకు ముప్పు ఉంటుంది. జ్వరం అధికంగా ఉంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. తరుచూ గ్లూకోజ్ వాటర్ తాగడం మంచిది. డయాబెటిస్ ఉన్నవారు నీటిలో కేవలం నిమ్మరసాన్ని కలుపుకొని తాగాలి. కొబ్బరినీళ్లలో పొటాషియం ఎక్కువగా లభిస్తుంది. సాధారణ వ్యక్తులు తరుచూ నిమ్మరసంలో చక్కెర, ఉప్పు కలుపుకొని తాగాలి. తినే ఆహారంలో ఎక్కువగా నీరు, పీచు పదార్థాలు ఉండేలా తీసుకోవాలి. తాజా పండ్లు, ఆకుకూరలు తినాలి. ఉదయాన్నే వాకింగ్, చిన్నపాటి ఎక్సర్‌సైజులు చేయాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు మాత్రం వైద్యులు సూచన మేరకు వ్యాయామం చేయాలి. ఆయిల్ ఫుడ్ నిషేధించాలి. బయట దొరికే ఫాస్ట్, ఇతర జంక్ ఫుడ్ తీసుకోకూడదు. శరీరంలో ఉష్ణోగ్రతలు పెరుగకుండా అధికంగా నీరు సేవించాలి.

సంప్రదాయ ఆహారం తీసుకోవాలి



ఎండాకాలంలో ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ కాకుండా సంప్రదాయ ఆహారాన్ని సేవించడం మంచిది. అవసరం ఉంటేనే తప్ప బయటకు వెళ్లొద్దు. కాటన్ వస్త్రాలను ధరించాలి. బయటకు వెళ్లేవారు తప్పకుండా నీరు వెంట తీసుకెళ్లాలి. బాలింతలు మరింత జాగ్రత్తగా ఉండాలి. పిల్లలకు పాలు ఇవ్వాలి కాబట్టి తీసుకునే ఆహారంలో ప్రొటీన్లు, విటమిన్లు ఉండే వాటిని తీసుకోవాలి. ఎక్కువగా నీరు, మధ్యలో చల్ల (మజ్జిగ), కొబ్బరినీరు తాగడం మంచిది. పండ్లు, తాజా కూరగాయలను ఎక్కువగా తినాలి. ఇంట్లో తయారు చేసుకున్న తాజా పండ్ల రసాలు, నిమ్మరసం తాగాలి. ఆహారంలో ముఖ్యంగా మసాలాలు, కారం, పులుపు, వేపుడు ఉండొద్దు. శీతల పానీయాలు అస్సలే తీసుకోవద్దు. ఎండకు ఎక్కువ సేపు ఉండకూడదు. ఎండదెబ్బ తాకితే సొంత వైద్యం కాకుండా అర్హులైన వైద్యుడిని సంప్రదించాలి. వడదెబ్బ తగిలితే విరోచనాలు, డయేరియా, జ్వరం వంటివి వస్తాయి. వడదెబ్బ తాకిన వ్యక్తి బీపీ లెవెల్స్ పడిపోతాయి. హైపోటెన్షన్‌కు గురవుతారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది. చెమటలు పట్టడం.. తలనొప్పి, డీహైడ్రేషన్ వంటివి జరుగుతాయి.



జనం లేక వెలవెలబోతున్న సిరిసిల్ల మార్కెట్

శరీరంపై ఎండ పడనీయొద్దు



పిల్లలపై ఎండ ఎక్కువసేపు పడటం మంచిది కాదు. వారికి వేసవి ఉపశమనానికి కాటన్ బట్టలు వేయాలి. శరీరం మొత్తం ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సిల్క్,ఇతర బట్టలు వేయొద్దు. వడదెబ్బ తాకిన పిల్లలకు చెమటలు ఎక్కువగా పెడుతాయి. అధిక జ్వరం ఉంటుంది. స్పృహ తప్పి కళ్లు తేలేస్తుంటారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఎక్కువగా నీరు తాగిస్తుండాలి. ఇంట్లో ఉన్నప్పుడు తరుచూ ఉప్పు కలిపిన నిమ్మరసం ఇవ్వాలి. ఇలా చేస్తే శరీరంలోని లవణాలు తగ్గిపోకుండా ఉంటాయి. తలపై, సంకల్లో.. గజ్జల్లో తడి బట్టను పెట్టాలి. కొబ్బరినీళ్లను తాగించవచ్చు. పెరుగు, చల్ల సేవించడం మంచిది. ఆర్నెళ్లలోపు పిల్లలకు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం మంచిది. ఆపై వయస్సు గల పిల్లలను కొబ్బరినీళ్లు, ఇంట్లో తయారు చేసిన జ్యూస్‌లు తాగించొచ్చు.

జీవాలకూ ఎండలు ప్రమాదమే..



ఇప్పుడున్న మండుటెండలు మనుషులకే కాదు పశువులు, పెంపుడు జంతువులకూ ప్రమాదమే. పశువులకు ఇంటి పరిసరాల్లో, పెట్స్‌కు ఇంట్లోనే గాలి తగిలేలా పెంచాలి. ఉదయం 9గంటలలోపే మేతకు తీసుకుపోయి రావాలి. జీవాలకు కనీసం పది నుంచి పదిహేను లీటర్ల నీరు తాగించాలి. ఎండదెబ్బ తాకిన పెట్స్ కరువడం, ఎక్కువగా మొరగుతూ.. పిచ్చిగా ప్రవర్తిస్తుంటాయి. అధిక వేడిమి మూలంగా డీహైడ్రేషన్ బారిన పడుతుంటాయి. ఆహారంతోపాటు నీరు ఎక్కువగా తాగేలా చూడాలి. రెగ్యులర్ టీకాలు వేయించాలి. పశువులకు గడ్డిరోగం వచ్చే అవకాశం ఉంది. సీజనల్ వ్యాక్సిన్లు వేయించాలి. వెటర్నరీ వైద్యుల సూచనలతోనే మందులు వాడాలి. షీప్ పాక్స్, గోట్‌పాక్స్, సిరిసిల్ల వెటర్నరీ ఆస్పత్రిలో అన్నిరకాల మందులు సిద్ధంగా ఉన్నాయి. గాలికుంటు వ్యాధికి ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి టీకాలు వేస్తున్నాం. ప్రణాళికబద్ధంగా జీవాల వద్దకు వెళ్లి సీజనల్ వ్యాక్సిన్లు, మందులు అందిస్తున్నాం. ఆస్పత్రిలో జీవాలకు కావాల్సిన జెంటామైసిన్, ఎంట్రోఫ్లాక్సిన్, మెల్‌నెక్స్, బెలామిన్, ఎవిల్, ఒరిప్రిమ్, డి–వార్మింగ్, టెట్రాసైక్లిన్, కెఫ్లామ్, నెబ్లామ్ తదితర మందులు సిద్ధంగా ఉన్నాయి. అన్ని ఉచితంగా అందిస్తాం.



నేతన్నచౌక్ వద్ద..

యారన్ సబ్సిడీ అందించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

- వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలి
- జౌళిశాఖ ఆఫీస్ ముందు సీఐటీయూ ధర్నా

సిరిసిల్ల: బతుకమ్మ చీరలు నేసిన కార్మికులకు కూలీ సర్దుబాటులో భాగంగా చెల్లించే యారన్ సబ్సిడీ పది రోజుల్లోగా అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నేత కార్మికులు ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రంలోని జౌళిశాఖ కార్యాలయం ముందు బుధవారం ధర్నా చేశారు. పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ.. కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీని పది రోజుల్లోగా చెల్లించాలన్నారు. కార్మికులకు 2020, 2021, 2022 సంవత్సరాల్లో నేసిన బతుకమ్మ చీరల 10 శాతం యారన్ సబ్సిడీ రావాల్సి ఉందన్నారు. 2020 నాటి డబ్బులను కార్మికుల ఖాతాల్లో 10 రోజుల్లో జమ చేయాలని, లేకుంటే జౌళిశాఖ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. వర్కర్ టూ ఓనర్ పథకాన్ని అమలు చేయాలని, లబ్ధిదారులను ఎంపిక చేయాలని, అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అనంతరం జౌళిశాఖ ఏడీ సాగర్‌కు వినతిపత్రం అందించారు. సీఐటియూ నాయకులు ఏలిగేటి రాజశేఖర్, మోర అజయ్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నక్క దేవదాస్, గుండు రమేశ్, సబ్బని చంద్రకాంత్, బెజుగం సురేశ్, మూషం శంకర్, మోర తిరుపతి, పోచమల్లు, దశరథం, కనకరాజు, దామోదర్, కమలాకర్, ఆంజనేయులు, మహేశ్, రమేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

‘సెస్’ టీపీటీడీసీ చైర్మన్లకు హైకోర్టు షోకాజ్ నోటీసులు

- జూన్ 15లోగా జవాబు ఇవ్వాలని ఆదేశం

సిరిసిల్ల: సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) చైర్మన్ చిక్కాల రామారావు, తెలంగాణ పవర్‌లూమ్, అండ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీపీటీడీసీ) చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కు హైకోర్టు బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సిరిసిల్లకు చెందిన డి.ప్రభాకర్‌రావు వేసిన అఫిడవిట్‌పై సంజాయిషీ కోరుతూ హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. డబ్ల్యూపీనంబర్ 10859 ఆఫ్ 2023 ద్వారా జస్టిస్ పి.మాధవిదేవి తెలంగాణ ప్రభుత్వ చేనేత, పవర్‌లూమ్ కార్పొరేషన్ కార్యదర్శి, కమిషనర్, ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావు, టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్‌కు షోకాజ్ నోటీసులను జారీ చేశారు. జూన్ 15లోగా దీనిపై సంజాయిషీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ‘సెస్’ చైర్మన్‌గా చిక్కాల రామారావు, ‘సెస్’ వైస్ చైర్మన్‌గా గూడూరి ప్రవీణ్ హయాంలో జరిగిన అవినీతిపై కోర్టులో కేసు దాఖలు చేసినట్లు డి.ప్రభాకర్‌రావు తెలిపారు. వారిద్దరి హయాంలో ‘సెస్’లో జరిగిన అవినీతిపై కోర్టులో కేసు విచారణలో ఉండగా.. వారికి పదవులు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టును ఆశ్రయించినట్లు వివరించారు. చిక్కాల, గూడూరికి హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేయడం జిల్లాలో చర్చనీయాంశమైంది.

విచ్చలవిడిగా కలప దందా

- ప్రభుత్వానికి లక్షల రూపాయల గండి
- అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



మల్లారం నుంచి తరలిపోతున్న కలప

వేములవాడరూరల్: ప్రభుత్వ స్థలంలో పెరిగిన చెట్లను దర్జాగా కొంతమంది వ్యాపారులు నరికివేస్తూ అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వేములవాడ మండలం మల్లారం గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న దేవతుల చెరువులో కొన్నేళ్లుగా ఏపుగా పెరిగిన వేపచెట్లను కొంతమంది నరికి తరలిస్తుండగా మంగళవారం రాత్రి గ్రామస్తులు పట్టుకున్న విషయం తెలిసిందే. దీనిపై గ్రామానికి చెందిన మల్లారం శ్రీకాంత్, తిరుపతి బుధవారం ఫారెస్టు, రెవెన్యూ అధికారులతో పాటు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న చెట్లను నరికివేయొద్దని నిబంధనలు ఉన్నప్పటికీ గ్రామానికి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధుల అండతోనే కలప వ్యాపారులు కర్రను తరలిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మొక్కలు నాటాలని చెబుతున్నప్పటికీ పెరిగిన చెట్లను నరికివేస్తున్నారంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామస్తుల అనుమతితోనే..

రెండేళ్ల క్రితం రూ.3.50 లక్షలకు గ్రామాభివృద్ధి కోసం అందరి నిర్ణయం మేరకే అనుమతి ఇచ్చాం. వర్షాలతో చెట్లను కొట్టలేదు. కావాలనే కొంతమంది ఆరోపణలు చేస్తూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నేను ఎలాంటి అవినీతికీ పాల్పడలేదు.

– పండుగ తిరుపతి, సర్పంచ్, మల్లారం

చర్యలు తీసుకుంటాం

మల్లారం గ్రామం నుంచి కలప తరలిపోతున్నట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీనిపై గురువారం సంఘటనా స్థలానికి వెళ్లి గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపడతాం. అనుమతులు లేకుండా ఆ ప్రాంతంలో కలపను తరలించినట్లు తేలితే కేసులు నమోదు చేస్తాం.

– ఖలీలొద్దీన్, ఎఫ్‌ఆర్‌వో, వేములవాడ

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయాలి

- డెంగీ కేసులను అరికట్టాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి



కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

వేములవాడఅర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు తెలిపారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలతో బుధవారం సమీక్షించారు. వేములవాడ చందుర్తి, కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రల్లో గైనకాలజిస్టు రాత్రిపూట అందుబాటులో ఉండాలన్నారు. క్షయ బాధితులను గుర్తించేందుకు శాంపిల్ సంఖ్య పెంచాలన్నారు. డెంగీ కేసులను పూర్తిగా అరికట్టాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సీహెచ్‌వో ఆంజనేయులుపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు. డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు, శ్రీరాములు, రజిత, ఆసుపత్రి సూపరింటెండెంట్ మహేశ్‌రావు ఉన్నారు. లక్ష్మీపురం ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మరుగుదొడ్లు, వంటగది, ఎలక్ట్రికల్, ప్రహారీ, నూతన తరగతి గదుల నిర్మాణం పనులను పరిశీలించారు. రుద్రవరం–సంకెపల్లి పీఏసీఎస్ పరిధిలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. డీఈవో రమేష్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్ ఉన్నారు.

వారంరోజుల్లో సీఎంఆర్ పూర్తి చేయాలి.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం తూకం వేస్తూ.. రైస్ మిల్లులకు తరలించాలని, అన్‌లోడ్ అయ్యేలా చూడాలని కోరారు. 2021–2022 యాసంగి సీజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 18వేల టన్నుల బియ్యాన్ని రైస్‌మిల్లర్లు ఎఫ్‌సీఐకి వారం రోజుల్లో డెలివరీ చేయాలని ఆదేశించారు. 24 గంటలు రైస్ మిల్లుల్లో పని కొనసాగాలన్నారు.

జిల్లాలో నాకాబందీ



వేములవాడలో నాకాబందీలో సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం/వేములవాడఅర్బన్: జిల్లాలో శాంతిభద్రతల దృష్ట్యా బుధవారం రాత్రి పోలీసులు నాకబందీ నిర్వహించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలు, మండల సరిహద్దులో ఏకకాలంలో పోలీసులను మోహరించి వాహనాల తనిఖీలు, అనుమానిత వ్యక్తులను నిలిపి సమాచారాన్ని రాబట్టారు. ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా కేంద్రంతోపాటు వేములవాడలోని పలు ప్రాంతాల్లో తనిఖీలను ఆకస్మికంగా పర్యవేక్షించారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనం నడిపిన, నంబర్ ప్లేట్ దాచినా లేదా కొన్ని నంబర్లు తొలగించిన వాహనాలు సీజ్‌చేసి వాహనదారులపై కేసు నమోదు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోకి ప్రవేశించు అన్ని దారుల్లో, మండల హెడ్‌క్వార్టర్స్‌లల్లో నాకాబందీ నిర్వహించామన్నారు. అసాంఘిక శక్తులు, అనుమానిత వ్యక్తులను కట్టడి చేసేందుకు, నేరాలఅదుపునకు నాకబందీ నిర్వహించామన్నారు. జిల్లాలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని, డయల్ 100కు ఫోన్ చేసి చెప్పాలని అన్నారు.

క్లుప్తంగా

21న ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

కరీంనగర్: తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కోర్సు–1 బ్యాచ్–2023 పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నేతానియల్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జగిత్యాల రోడ్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను ఈ నెల17 నుంచి www.tsstudycircle.co.in వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

- జమ్మికుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఘటన



జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతి చెందింది. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై బుధవారం ఓ వృద్ధురాలు మృతిచెందినట్లు ప్రయాణికులు గుర్తించారు. మృతురాలి వయసు 75 ఏళ్ల వరకు ఉంటుంది. ఆమె మృతికి ఎండ తీవ్రతనా లేక అనారోగ్యమా అన్న కారణాలు తెలియ లేదు. మృతురాలి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని, ఒంటిపై వంకాయ రంగ బ్లౌజ్, కనకాంబరం రంగుతో చుక్కల చీర ధరించిందని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఆమె మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసినవారు 99493 04574, 94407 00039 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం



అజయ్‌కుమార్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కింద పడి, ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కల్వల గ్రామానికి చెందిన మారమల్ల అజయ్‌కుమార్(19) వీణవంక మండల కేంద్రంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో పని చేసేవాడు. మద్యానికి బానిసవడంతో అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు పలుమార్లు ఎంజీఎంలో వైద్యం చేయించారు. అయినా అతను తాగడం మానలేదు. దీంతో అనారోగ్యం నుంచి కోలుకోకుండా మనస్తాపానికి గురై, బుధవారం జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

కత్తితో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని మద్దికుంటకు చెందిన దుమాల మధుపై అదే గ్రామానికి చెందిన సూత్రం కరుణాకర్ మంగళవారం రాత్రి కత్తితో దాడి చేశాడని ఏఎస్సై వెంకటరమణ తెలిపారు. ఈ ఘటనలో మధుకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. పాత కక్షలను మనసులో పెట్టుకొనే కరుణాకర్ దాడి చేశాడని చెప్పారు. బాధితుడిని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించామని, అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరుణాకర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నడవలేకపోతున్న.. సాయం చేయండి

- రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డిగ్రీ విద్యార్థి
- అప్పు చేసి, ఇప్పటికే రూ.5 లక్షలు ఖర్చు
- మెరుగైన వైద్యానికి మరో రూ.10 లక్షలు అవసరమంటున్న వైద్యులు
- దాతలు ఆదుకోవాలని బాధిత కుటుంబసభ్యుల వేడుకోలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రం దాటి, బతుకుదెరువు కోసం వచ్చిన ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది.. రోడ్డు ప్రమాదంలో కుమారుడికి తీవ్ర గాయాలవగా అప్పు చేసి, రూ.5 లక్షలతో వైద్యం చేయించారు.. అయినా అతను నడవలేకపోతుండటంతో కుటుంబసభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మెరుగైన వైద్యం కోసం దాతలు సాయం అందించాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు జిల్లా చంద్రపాడుకు చెందిన కుంచాల



అమ్మానాన్నతో కార్తీక్

రేణుక–వెంకట్‌రావు దంపతులకు కార్తీక్, తేజస్వి సంతానం. వెంకట్‌రావు బతుకుదెరువు కోసం కుటుంబసభ్యులతో కలిసి ఎల్లారెడ్డిపేట వచ్చాడు. ఇక్కడే భవన నిర్మాణ కార్మికునిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సాఫీగా సాగుతోందని అనుకుంటున్న జీవితంలో ఒక్కసారిగా కుదుపు.. రోడ్డు ప్రమాదం వారిని అంధకారంలోకి నెట్టింది. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న కార్తీక్ సిద్దిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు రూ.5 లక్షలు అప్పు చేసి, తిరుపతి, గుంటూర్, నల్లగొండ, హైదరాబాద్, వరంగల్‌లోని పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించారు. అయినా ఫలితం లేకపోయింది. ఇప్పటికీ కార్తీక్ నడవలేకపోతున్నాడు. పట్టుకొని, నిల్చోబెడితే గోడ సపోర్టుతో నిల్చుంటున్నాడు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని, ఇందుకు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని తెలిపారు. ఇప్పటికే అప్పు చేశామని, భూమి కూడా లేదని కార్తీక్ తల్లిదండ్రులకు కన్నీరు పెట్టుకుంటున్నారు. తమ కుమారుడి వైద్యానికి దాతలు ఆర్థికసాయం అందించి, ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

93919 58594(వెంకట్‌రావు) ఫోన్ నంబర్‌కు ఫోన్ పే లేదా గూగుల్ పే చేయాలని కోరుతున్నారు.

ప్రజల భద్రత కోసమే పోలీస్‌శాఖ

- స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రవికుమార్
- కంచర్లలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

వీర్నపల్లి: సమాజంలో ప్రజల భద్రతే కోసమే పోలీస్‌శాఖ పనిచేస్తుందని స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రవికుమార్ అన్నారు. బుధవారం వీర్నపల్లి మండలంలోని కంచర్ల గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. 60 మంది పోలీస్ సిబ్బందితో గ్రామంలో ఇంటింటా తనిఖీలు చేసి సరైన పత్రాలు లేని 46 ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్ సీజ్ చేశారు. గ్రామంలోని నర్సయ్య, రమ ఇళ్లలో అడవి జంతులను వేటాడానికి ఉపయోగించే వల, వైర్లు, దప్పి కొమ్ములను స్వాధీనం చేసుకుని బైండోవర్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల భద్రత, నేరాల నిర్మూలనకు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గ్రామంలోఅనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకూడదన్నారు. రోడ్డుభద్రతా నియమాలు పాటించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వీయ రక్షణకు గ్రామంలో సీసీ కెమారాలను



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్సైలు నవత, శేఖర్, మహేశ్, రాజేష్, ఆర్ఎస్ఐ రమేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఆ టీచర్ల డ్యూటీ సర్టిఫికెట్లు ఫేక్?’

జగిత్యాల: జిల్లాలో ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు పర్యవేక్షకులుగా సారంగాపూర్ మండలంలోని 10 మంది ఉపాధ్యాయులను మార్చి 15 నుంచి ఏప్రిల్ 1 వరకు రిలీవ్ చేశారు. దీంతో వారు మార్చి 14న మధ్యాహ్నం 2 గంటలకు సదరు పరీక్ష కేంద్రాల్లో రిపోర్ట్ సైతం చేశారు. కానీ వీరిలో కొందరు టీచర్లు అటు ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణకు, ఇటు పాఠశాలలకు వెళ్లలేదు.


అన్నీ ప్రెజెంట్ అని వేసుకున్నారు..

ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణకు వెళ్లిన టీచర్లు తిరిగి పాఠశాలల్లో జాయిన్ అయ్యే సమయంలో హెచ్‌ఎంలకు, హెచ్‌ఎంలే అయితే ఎంఈవోలకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాల్సి ఉంటుంది. కానీ అవి అందజేయకుండానే ఉపాధ్యాయులు తమ విధుల్లో చేరారు. 15 రోజులకు సంబంధించిన జీతం సైతం తీసుకున్నారు. ‘సాక్షి’ దినపత్రికలో ‘ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు’ అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో సంబంధిత ఎంఈవో ఈ నెల 15వ తేదీలోపు డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని వారిని ఆదేశించారు. దీంతో కొందరు అందజేశారు. వీరిలో పర్యవేక్షకులుగా పనిచేయనప్పటికీ ఫేక్ సర్టిఫికెట్ సృష్టించి, ఎంఈవోకు అందించినట్లు తెలిసింది. రిలీజ్ ఆర్డర్‌లో ఇంటర్మీడియట్ అధికారులు కంప్యూటర్ షీట్‌లో అబ్‌సెంట్, ప్రెజెంట్ వేశారు. కానీ కొందరు



ఒక సర్టిఫికెట్‌లో హ్యాండ్ రైటింగ్..

టీచర్లు వాటిని జిరాక్స్ తీసుకొని, చేతితో అన్నీ ప్రెజెంట్ అని వేసుకున్నారు. కాగా, మార్చి 15 నుంచి వీరు విధుల్లో చేరుతున్నట్లు ఉండగా డ్యూటీ సర్టిఫికెట్‌లో మాత్రం 10 నుంచే వెళ్లినట్లు పెట్టారు. అలాగే పేర్లను అధికారులు పెన్నుతో రాయగా కొందరు కంప్యూటర్ షీట్‌లో టైప్ చేసుకున్నారు. ఎవరి ఇష్టానుసారంగా వారు డ్యూటీ సర్టిఫికెట్లు తయారు



మరో సర్టిఫికెట్ కంప్యూటర్ షీట్‌లో..

చేసి, అందజేశారు. ఇవి ఫేక్ డ్యూటీ సర్టిఫికెట్లు అని స్పష్టంగా తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే నిజానిజాలు బయటపడతాయని పలువురు భావిస్తున్నారు. ఈ విషయమై సారంగాపూర్ ఎంఈవో భీమయ్యను వివరణ కోరగా డ్యూటీ సర్టిఫికెట్లు తీసుకొని, డీఈవోకు పంపించామని, ఆయన పరిశీలిస్తారని తెలిపారు.

వెల్గొండలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం

బుగ్గారం(ధర్మపురి): మండలంలోని వెల్గొండలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, ఓ ఇల్లు దగ్ధమైంది. సామగ్రి కాలిబూడిదవగా కుటుంబసభ్యులు నిరాశ్రయులయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పెసరి అశోక్, పాండు సోదరులు. వీరి ఇంట్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కలవారు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి రాలేదు. ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయినప్పటికీ సమీపంలోని రెండు ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. మంటలు చెలరేగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణన



ష్టం తప్పింది. అశోక్, పాండు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ఫారుఖ్ పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు. రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. తక్షణసాయంగా బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాదినేని రాజేందర్ వారిని పరామర్శించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి, అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. తన వంతు తక్షణసాయంగా రూ.10 వేలు అందించారు. బాధితులకు ప్రస్తుతం వారి బంధువుల ఇంట్లో ఆశ్రయం కల్పించారు.

జవాన్ అనిల్ కుటుంబానికి ఆర్థికసాయం



బోయినపల్లి(చొప్పదండి): ఇటీవల జమ్మూ–కశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మల్యాపూర్‌కు చెందిన జవాన్ పబ్బాల అనిల్ మృతిచెందిన విషయం విధితమే. బాధిత కుటుంబాన్ని మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అనిల్ భార్య సౌజన్య, తల్లి లక్ష్మిలకు రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సర్పంచ్‌లు చెన్నాడి రాజ్యలక్ష్మి, కోరెపు నరేశ్, నాయకులు సత్తినేని భాగ్యలత, కిషన్, నాగారపు సత్యానారయణ, రామానుజం, రమేశ్, సతీశ్, రాజేశం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- రాఘవపేట వద్ద ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన షేక్ అఫ్సర్ (34) బుధవారం ద్విచక్ర వాహనంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ వెళ్లి, తిరిగి వస్తున్నాడు. మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల సాయిలు బైక్‌పై మెట్‌పల్లి వెళ్లి తిరిగివస్తుండగా రాఘవపేట పెట్రోల్ బంక్ వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షేక్ అఫ్సర్ తలకు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిలు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ముంతాజ్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.



అఫ్సర్ మృతదేహం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లతిమ్మాపూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అన్నారం గ్రామానికి చెందిన మంగళి పోచమల్లు, రవీందర్‌లు బుధవారం రాత్రి ద్విచక్రవాహంపై మాచారెడ్డి నుంచి రాచర్లగొల్లపల్లికి వస్తున్నారు. అదే సమయంలో తిమ్మాపూర్‌కు చెందిన రాజు ఎల్లారెడ్డిపేట నుంచి కామారెడ్డికి బైక్‌పై వెళ్తున్నాడు. రాచర్ల తిమ్మాపూర్ శివారులో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని బతికపల్లి శివారు కొండాయపల్లికి చెందిన బోగు లత (38) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లత కొంతకాలంగా కడుపునొప్పితో బాధ పడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కావడం లేదు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో కడుపునొప్పి తీవ్రమవడంతో ఆ బాధ భరించలేక దూలానికి ఉరేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు

జ్యోతినగర్: భూమి విక్రయిస్తానని డబ్బులు తీసుకొని, రిజిస్ట్రేషన్ చేయకుండా మోసగించిన వ్యక్తిపై ఎన్టీపీసీ పోలీసుస్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. తన సమీప బంధువు పెద్దపల్లికి చెందిన అలుగువెల్లి సతీశ్ మూడు గుంటల స్థలం విక్రయిస్తానని తన వద్ద రూ.16.80 లక్షలు తీసుకున్నాడని ఎన్టీపీసీ ఠాణా పరిధిలోని మాతంగికాలనీకి చెందిన పోలంపల్లి స్వరూప ఆరోపించింది. తాను మోసపోయానని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సతీశ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు వారు తెలిపారు.

గ్రామాల్లో పచ్చదనం పెంపొందించాలి

- పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్
- విలాసాగర్‌లో పర్యటన

జమ్మికుంట(హుజూరాబాద్): గ్రామాల్లో పచ్చదనం పెంపొందించి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా జమ్మికుంట మండలంలోని విలాసాగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనం, ఇంకుడు గుంతలు, జీపీ నర్సరీ, కంపోస్ట్ షెడ్లు, అవెన్యూ ప్లాంటేషన్ తదితరాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నిర్వహణ బాగుందని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పింగిళి రమాదేవి, కరీంనగర్ డీఎల్‌పీవో హరికృష్ణ, హుజూరాబాద్ డివిజనల్ డీఎల్‌పీవో శ్రీలత, ఎంపీడీవో కల్పన, ఎంపీవో సతీశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పల్లె ప్రకృతి వనం పరిశీలించిన జాయింట్ కమిషనర్ శ్రీనివాస్

అనాథ, పేద బాలురకు ఉచిత విద్య

- భోజన వసతితో ఇంగ్లిష్ మీడియం బోధన
- రంగినేని ట్రస్ట్‌లో డిజిటల్ తరగతులు
- ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు

సిరిసిల్ల: పట్టణ శివారులోని రంగినేని ట్రస్ట్‌లో అనాథ, పేద బాలురకు ఉచితంగా ఇంగ్లిష్ మీడియం విద్యనందిస్తామని ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు తెలిపారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగినేని ట్రస్ట్‌లో రెండు దశాబ్దాల పాటు అనాథ, పేద విద్యార్థులకు విద్యాబోధన చేశామని, 2020లో కరోనా లాక్‌డౌన్ కారణంగా స్కూల్ బంద్ చేసినట్లు తెలిపారు. 19 మంది పిల్లలను ప్రభుత్వ స్కూల్‌కు పంపించామన్నారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలురకు భోజన వసతితో ఇంగ్లిష్ మీడియంలో డిజిటల్ తరగతులతో విద్యాబోధన అందించేందుకు ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు నిర్ణయించారని చెప్పారు. స్కూల్ కరస్పాండెంట్ తూడి వెంకట్‌రావు మాట్లాడుతూ.. ట్రస్ట్‌లో చదువుకున్న విద్యార్థులు చాలా మంది దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, వివిధ స్థాయిల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారని తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్ పర్యవేక్షణలో ఇంగ్లిష్ మీడియం రెసిడెన్షియల్ స్కూల్ నడుపుతామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ట్రస్ట్‌లో అబ్బాయిలను చేర్పించవచ్చన్నారు. ప్రస్తుతం బాలికలను తీసుకోవడం లేదని తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్, ప్రముఖ విద్యావేత్త మడుపు ముత్యంరెడ్డి, ఉపాధ్యాయుడు నీలం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు

దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత

కోరుట్లటౌన్: బంగారం, నగదు ఉన్న బ్యాగు ఇద్దరు యువకులు దొరికింది.. దాన్ని వారు పోలీసులకు అప్పగించి, నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణంలోని ఓ ఫొటో స్టూడియోలో పని చేస్తున్న ఎల్ల సాయి, దామ రాజేశ్‌లకు పాత ఆనంద్ షాపింగ్ మాల్ వద్ద బుధవారం ఉదయం గులాబీ రంగు పర్సు దొరికింది. ఈ విషయాన్ని వారు తమ యజమాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోలీసులకు ఇస్తే, పోగొట్టుకున్నవారికి ఇస్తారని సూచించారు. దీంతో ఆ యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఎస్సై సతీశ్‌కు అందజేశారు. పర్సులో 2 తులాల బంగారు ఆభరణం, 1 తులం బంగారు బిస్కెట్, రూ.1,000 ఉన్నాయి. పోలీసులు సంఘటన స్థలానికి సంబంధించిన సీసీ ఫుటేజీ పరిశీలించి, బాధితురాలు మెట్‌పల్లి పట్టణానికి చెందిన ధనలక్ష్మికి సమాచారం ఇచ్చారు. ఆమె పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఆధారాలు పరిశీలించి, పర్సు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న యువకులను ఎస్సై అభినందించి, శాలువాలతో సన్మానించారు.



యువకులను సన్మానిస్తున్న ఎస్సై సతీశ్

కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు తోకల రమేశ్ కోరారు. ఆర్జీ–1 ఏరియా సీఎస్పీ రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమావేశం బుధవారం నిర్వహించారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతీ నెల 7వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని కోరారు. పేరుకే సర్క్యులర్లు జారీ చేస్తూ దానిపై సమీక్ష లేకుండా, కనీస పర్యవేక్షణ లేకుండా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. సకాలంలో వేతనాలు అందక కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకొని డైరెక్టర్ ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కె.శంకర్, ఎం.సమ్మయ్య, చిన్నయ్య, మధు, కొయ్యడ సురేశ్, శనిగరపు కృష్ణ, గాజుల రమేశ్, గంగుల వెంకటేశ్, భూదారపు సురేశ్ పాల్గొన్నారు.



రైల్వే కాంట్రాక్టు కార్మికులతో తోకల రమేశ్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- కూతురు పెళ్లికి చేసిన అప్పు తీర్చలేక ఈ నెల 16న ఆత్మహత్యాయత్నం



శ్రీనివాస్ (ఫైల్)

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామానికి చెందిన కలబోని శ్రీనివాస్(50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై విజేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కూలీ పని చేసేవాడు. ఇతనికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. అప్పు చేసి, కూతురు పెళ్లి జరిపించాడు. అప్పు తీర్చలేక, వడ్డీ చెల్లించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువు కట్టపై క్రిమిసంహారక మందు తాగాడు. తర్వాత ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్‌లో తెలిపాడు. వారు వెంటనే అతన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తొలుత కరీంనగర్, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

20న పౌర హక్కుల సంఘం బహిరంగ సభ

విద్యానగర్(కరీంనగర్): ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ గ్రామాలపై కేంద్ర ప్రభుత్వ యుద్ధ హెలికాప్టర్ల దాడులను నిలిపివేయాలని, ఆదివాసీల జీవించే హక్కుకు భంగం కలిగించొద్దన్న డిమాండ్లతో ఈ నెల 20న పెద్దపల్లిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పౌర హక్కుల, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సంబంధిత వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని మూన్ ఫంక్షన్‌హాల్‌లో బహిరంగ సభ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్ అధ్యక్షతన జరిగే ఈ సభకు వక్తలుగా రాష్ట్ర పౌరహక్కుల సంఘం సీనియర్ కార్యవర్గ సభ్యుడు హరగోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ హాజరవుతారని తెలిపారు. సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి బొడ్డుపెల్లి రవి, గడ్డం సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షుడు నార వినోద్, దళిత లిబరేషన్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తాళాలు వేసిన ఐదిళ్లలో చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్, నారాయణస్వామినగర్‌లలోని ఐదిళ్లలో బుధవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. 10 తులాల బంగారం, 8 తులాల వెండి, రూ.1.20 లక్షలు ఎత్తుకెళ్లారని ఎస్సై మహేందర్ తెలిపారు. బాధితులు వేగోలపు తిరుపతి, కట్ట రమేశ్, రాజన్న, బొల్లంపల్లి మహేశ్, ఇనుగాల రాజ్‌కుమార్ తమ ఇళ్లకు తాళాలు వేసి, కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇళ్లలో జరిగిన కార్యక్రమాలకు వెళ్లారని పేర్కొన్నారు. క్లూస్ టీం, ఫింగర్‌ప్రింట్ నిపుణులు ఆధారాలు సేకరించారు.



విచారణ జరుపుతున్న పోలీసులు